
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

శుక్రవారం 21 మార్చి 2025

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సెహరీ (శనివారం ఉదయం)
కడప	6.31	5.03
ప్రొద్దుటూరు	6.32	5.07

రంజాన్ చివరి దశకం..
సద్గుణాల ధామం..!



ప్రొద్దుటూరులోని మదీనా మసీదు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో హృదయ శుద్ధికి ఉపవాసం, ముక్తి మార్గానికి నమాజ్ దారి చూపుతాయని ప్రతి ముస్లిం ప్రగాఢ విశ్వాసం. ఇందులోనూ.. రంజాన్ మాసం చివరి దశకం (పది రోజులు)లో ఉపవాసాలు పాటిస్తూ బేసి సంఖ్యలో చేసే జాగారానికి మరింత ప్రాధాన్యం ఉంది. రంజాన్ మాసంలోని 21, 23, 25, 27, 29 రాత్రులల్లో ఎవరైతే జాగారం చేస్తారో వారు వెయ్యి నెలల కంటే ఎక్కువ ఆరాధనచేసిన పుణ్యాన్ని పొందుతారని ప్రగాఢ విశ్వాసం. దైవ ప్రసన్నతకోసం దివ్య ఖురాన్ పారాయణం, దాన ధర్మాలు, బీదసాదలను ఆదుకోవడం, జకాత్ చెల్లించడం, పాప క్షమాపణ ద్వారా విశ్వాసుల పాలిట రంజాన్ కారుణ్యంగా మారుతుంది.

జకాత్ పేదల హక్కు..

ఇస్లాంకు మూల స్తంభాలైన ఐదు అంశాలల్లో జకాత్ ఒకటి. స్థోమత కలిగిన ప్రతి విశ్వాసి తప్పనిసరిగా జకాత్ చెల్లించాలి. సంపాదనాపరులు, సంపన్నులు రంజాన్ నెలలో జకాత్ ఆచరించాలని ఖురాన్ బోధిస్తోంది. స్థోమత కలిగిన వారు తమ సంపాదనలో 2.5శాతం పేదలకు చెల్లించాలి. నిరుపేదలకు దానం చేయడం ద్వారా పేదవారు కూడా అందరితోపాటు పండుగను సంతోషంగా జరుపుకునేందుకు ఈ జకాత్ ఎంతగానో దోహదపడుతుంది. సాధారణంగా రంజాన్ నెల ఉపవాసాలు ముగిసే ముందే ఈ జకాత్ చెల్లించాలని పెద్దలు ఉపదేశిస్తారు.



ఎతెఖాఫ్..

రంజాన్ నెలలో మరో పవిత్ర అంశం ఎతెఖాఫ్. ఈ నెలలో చివరి పది రోజులు కుటుంబాన్ని తాత్కాలికంగా వదిలి మసీదుల్లో దైవ ఆరాధన, ప్రార్థనల్లో గడపడమే ఎతెఖాఫ్. ఇలా చేసిన వారికి, వారివల్ల మొత్తం సమాజానికి అధిక పుణ్య ఫలం దక్కుతుందని పవిత్ర ఖురాన్ మాట. రంజాన్ నెలలోని 27వ రాత్రిని పుణ్య రాత్రిగా పరిగణిస్తారు. ఆ రాత్రి జాగారంతో దైవారాధనలో గడుపుతారు. ఈ నెల రోజుల పాటు చదివిన ఖురాన్ చివరి అంకాన్ని ఈ రాత్రి ముగిస్తారు.

విధిగా ఫిత్రా చెల్లింపు..

ఫిత్రా అనేది రంజాన్ చివరిలో ఇచ్చే ధార్మిక విరాళం. పండుగ నమాజ్‌కు ముందు ఆర్థిక స్థోమత ఉన్న ప్రతిఒక్కరు 2.5 కిలోల నాణ్యమైన గోధుమలు లేదా వాటికి సమానమైన ధర మొత్తాన్ని పేదలకు దానంగా చెల్లించాలి. కుటుంబంలోని ప్రతి ఒక్కరి పేరుమీద తప్పనిసరిగా ఈ ధార్మిక విరాళం ఇవ్వాలి. దీనినే ఫిత్రా అని పిలుస్తారు.

ఆకలి, దప్పిక బాధను తెలియజేస్తుంది



రంజాన్ మాసంలో పాటించే ఉపవాసదీక్ష ఆకలి దప్పిక బాధను తెలియజేస్తుంది. దీంతో పాటు జీవితంలో ఎదిగేందుకు ఓర్పు సహనం అలవాటు అవుతుంది. ఆహారం కోసం ఎన్నో కష్టాలు పడుతున్న వారి బాధలు ధనవంతులకు తెలియజేయాలన్నదే రంజాన్ మాసం ముఖ్య ఉద్దేశం.

- ముఫ్తీ సయ్యద్ అబ్దుల్ మాలిక్, జామియా మసీదు ప్రొద్దుటూరు

- చైర్మన్ అభ్యర్థిగా బి.మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డి ఖరారు
- ఒక్కో జడ్పీటీసీకి రూ.20లక్షలు ఇస్తామని ఒప్పందం?
- అయితే రూ.5లక్షలతో సరిపెట్టేసిన వైనం



- ఇప్పటికే 8 మంది జడ్పీటీసీలు కూటమి వైపు మొగ్గు
- ఎన్నికల రోజున మరికొందరు గైర్హాజరయ్యే అవకాశం
- 23న జడ్పీటీసీలతో జగన్ ముఖాముఖి
- జడ్పీటీసీ సభ్యుల్లో అసంతృప్తి

వైసీపీలో జడ్పీ దడ

జగన్ పార్టీ స్థాపించినప్పటి నుంచి 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల వరకూ జిల్లాలో వైసీపీ హవా కొనసాగింది. ఒక్క 2016 లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం వైసీపీ నుంచి పోటీ చేసిన వైఎస్ వివేకానందరెడ్డి ఓటమి పాలయ్యారు. తర్వాత 2019 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో వైసీపీ క్లీన్‌స్వీప్ చేసింది. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన హవా కొనసాగించింది. అయితే.. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. ఆ ఓటమి నుంచి ఇంకా ఆ పార్టీ కోలుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 27న జరగనున్న ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక ఇప్పుడు వైసీపీలో దడ పుట్టిస్తోంది.

(కడప-ఆంధ్రజ్యోతి): ఆకేపాటి అమరనాథరెడ్డి రాజంపేట ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయన జడ్పీచైర్మన్ పదవికి రాజీనామా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో జడ్పీ చైర్మన్ పీఠంపై టీడీపీ కన్నేసిందని కైవసం చేసుకుంటుందంటూ ప్రచారం సాగింది. ఆ తరువాత సైలెంట్ అయిపోయింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నికకు ఇటీవలే ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా జడ్పీ చైర్మన్ కోసం 23న నోటిఫికేషన్ జారీ చేసి 27న ఎన్నిక నిర్వహిస్తారు.

వైసీపీలో కాక

ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గోపవరం జడ్పీటీసీ స్థానాన్ని మాత్రమే టీడీపీ గెలుచుకుంది. అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ తన మార్కు చూపించడంతో మిగతా 49 స్థానాలు వైసీపీ పరమయ్యాయి. ఒంటిమిట్టకు పోటీ చేసిన ఆకేపాటి అమరనాథరెడ్డి అనంతరం ఎమ్మెల్యే కావడంతో ఆయన జడ్పీటీసీ స్థానానికి రాజీనామా చేశారు. పులివెందులకు చెందిన జడ్పీటీసీ మరణించారు. దీంతో ప్రస్తుతం 48 మంది జడ్పీటీసీ సభ్యులున్నారు. వీరిలో ఒకరు టీడీపీ కాగా మరో 8 మంది టీడీపీతో సన్నిహితంగా ఉంటున్నారంటారు.

జడ్పీ చైర్మన్ పదవి కోసం సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, బి.మఠం జడ్పీటీసీ రామగోవిందురెడ్డితో పాటు పలువురు పోటీపడ్డారు. చివరికి బి.మఠం జడ్పీటీసీ వైపు మొగ్గు చూపారు. ఈ పంచాయితీ జగన్ వద్దకు చేరింది. ఒక్కో జడ్పీటీసీకి రూ.20లక్షలు ఇచ్చేలా అక్కడ ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెబుతారు. ఆ ఒప్పందంలో భాగంగా రూ.5లక్షలు ఇచ్చారని చెబుతారు. మిగతా రూ.15లక్షలు ఇవ్వకపోవడంతో జడ్పీటీసీలు అసంతృప్తితో రగిలిపోతున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు వైసీపీ నేతలు కూడా అలర్ట్ అయ్యారని అంటున్నారు. రూ.20లక్షలు ఇస్తామని చెప్పి రూ5లక్షలు మాత్రమే ఇచ్చి మిగతా మొత్తం ఇవ్వకపోతే ఎలా అంటూ జడ్పీటీసీలు అంతర్గతంగా సంభాషించుకుంటున్నట్లు చెబుతారు. అంతర్గత సంభాషణల్లో పార్టీ నాయకత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని సమాచారం.

23న జగన్ ముఖాముఖి

జడ్పీ చైర్మన్ ఎన్నిక ఈ నెల 27న జరగనుంది. జడ్పీటీసీ సభ్యులు కొంత అసంతృప్తిగా ఉన్నారు. పైగా టీడీపీ అధికారంలో ఉంది. జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని పోగొట్టుకుంటే మైనస్ అవుతుందని వైసీపీ నేతలు ఉలిక్కిపడినట్లు తెలుస్తోంది. జగన్ ఈ నెల 23న వేంపల్లెలో ఓ రిసెప్షన్‌కు రానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ రోజున జగన్ జడ్పీటీసీలలతో వన్ టు వన్ మాట్లాడేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెబుతున్నారు.

చంద్రబాబును కలవడంతో వైసీపీలో టెన్షన్

జిల్లాపరిషత్ చైర్మన్ ఎన్నికకు ఏడు రోజులు మాత్రమే ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, కమలాపురం, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, నంద్యాల వరదరాజులరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, అరవ శ్రీధర్‌తో పాటు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి చంద్రబాబును కలిశారు. జిల్లా అభివృద్ధిపై నిధుల కోసం చర్చించినట్లు టీడీపీ నేతలు ప్రకటన విడుదల చేశారు. అయితే వీరంతా చంద్రబాబును కలవడం వెనుక ఏదో గూడుపుఠాణి ఉన్నదనే అనుమానం వైసీపీ నేతల్లో ఉందంటున్నారు., గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీటెక్ రవి గెలుపును వైసీపీ నేతల్లో కొందరు గుర్తు తెచ్చుకుంటున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికపై ఏమైనా చర్చించారా అనేది వైసీపీ ఆరా తీస్తోంది. కాగా ఈ నెల 27న ఎన్నికకు హాజరుకావాల్సిందిగా కలెక్టర్ శ్రీధర్ జడ్పీటీసీలకు నోటీసులు పంపించారు. అయితే కొందరు జడ్పీటీసీలు ఎన్నికకు గైర్హాజరు కావాలని నిర్ణయించుకున్నారని చర్చ నడుస్తోంది. మొత్తానికి అయితే ఈ వ్యవహారం వైసీపీలో కాక లేపుతోంది.

మహానాడుపై సీఎంతో భేటీ

కడప, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కడప వేదికగా నిర్వహించనున్న మహానాడుకు సంబంధించి ఏర్పాట్లపై ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలు సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. గురువారం అసెంబ్లీలోని సీఎం చాంబరులో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, ఎన్.వరదరాజులరెడ్డి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, అరవ శ్రీధర్, జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సీఎంను కలిశారు. మహానాడుపై చర్చించారు. ఏర్పాట్లు ఘనంగా చేయాలని, వసతి పరంగా ఎవరికీ ఇబ్బంది లేకుండా చూడాలని చంద్రబాబు ఆదేశించారు. ఇక కడప కేంద్రంగా మహానాడు నిర్వహిస్తుండడంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఓ భారీ ప్రాజెక్టును ప్రకటించాలని సీఎంను కోరారు. దీనికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. 27న జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక జరుగుతున్న విషయాన్ని టీడీపీ నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎంతమంది ఉన్నారని అనగా మెజార్టీ లేదని టీడీపీ నేతలు బదులిచ్చారు. మరి ముందు నుంచే అనుకొని ఉండింటే సరిపోయేది, ఇప్పటికిప్పుడు అనుకుంటే కష్టం కదా.. వదిలేయాలని చెప్పినట్లు తెలిసింది. ఇక వైఎస్సార్‌కడప జిల్లాగా మార్చినందుకు సీఎం చంద్రబాబుకు నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పీపీ యూనిట్ వైద్యాధికారిణి
ఇలియారాణి సస్పెన్షన్

ప్రొద్దుటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పీపీ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ ఇలియారాణి విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో సస్పెండ్ చేస్తూ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఆదేశాలు జారీ చేశారు. చాపాడు మండలం నక్కలదిన్నెకు చెందిన శివలక్ష్మికి చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఆమె అనారోగ్యం పాలయ్యారు. హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుని ఆర్థికంగా నష్టపోయారు. దీనిపై అనేక మార్లు జిల్లా వైద్యాధికారులకు, కలెక్టర్‌కు విన్నవించినా న్యాయం జరగలేదని ఆరోపిస్తూ ఆమె భర్త సోమవారం కలెక్టరేట్‌లో ఆత్మహత్యాప్రయత్నం చేశారు. ఈ సంఘటనపై స్పందించిన జిల్లా అధికారులు డాక్టర్ ఇలియారాణిని సస్పెండ్ చేశారు.

ప్రజా సమస్యలకు..
పరిష్కారం దొరికేనా..?

కడప రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్‌కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10-15 గంటలకు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యసేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమ స్థాయి సంఘాలకు సంబంధించి జిల్లా అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ కోరారు. కానీ వైసీపీ సారథ్యంలోని జడ్పీ పాలకమండలి మాత్రం స్టాండింగ్ కమిటీ సమావేశాలను చాలా తేలిగ్గా తీసుకుంటోంది. 2021 సెప్టెంబరులో నిర్వహించిన ఎన్నికల్లో ఎక్కువమంది మంది జడ్పీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికై పదవిలోకి వచ్చారు. నాటి నుంచి స్టాండింగ్ కమిటీ సమావేశాలను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 8న నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశానికి 50 మందిలో ఏకంగా 32 మంది సభ్యులు హాజరుకాలేదు. జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఒక్కొక్కటి కాకుండా మూడు, నాలుగు సంఘాలను కలిపి ఒకేసారి గంపగుత్తగా నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా ఆయా స్థాయి సంఘాల చర్చ అరకొరగా సాగుతోంది.

నేడు జడ్పీటీసీ సభ్యులకు విందు

ఈ నెల 27వ తేదీన జడ్పీ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో వైసీపీ జడ్పీటీసీ సభ్యులకు శుక్రవారం 12 గంటలకు నగరంలో సమావేశం తదుపరి విందు ఏర్పాటుచేశారు. దీంతో నేటి జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని పూర్తిస్థాయిలో నిర్వహిసారో.? లేక ఎప్పటిలాగా మొక్కుబడిగా సాగించి పార్టీ కార్యక్రమానికి పయనమవుతారో వేచిచూడాలి.

వైఎస్సార్ కడప జిల్లాగా పేరుమార్పు

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు జీవో ఎంఎస్ నెం.99ని గురువారం విడుదల చేసింది. ఎంతో ప్రాచుర్యం పొందిన కడప జిల్లా పేరును దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం వైఎస్సార్ కడప జిల్లాగా మార్చారు. అయితే జగన్ ప్రభుత్వం అందులో కడప తొలగించి వైఎస్సార్ జిల్లాగా మార్చింది. కడపను కొనసాగించాలంటూ పెద్ద ఎత్తున డిమాండ్ రావడంతో వైఎస్సార్ కడప జిల్లాగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీవో జారీ చేసింది.



కొండాపురం రైల్వేస్టేషన్‌లో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నీళ్లు నింపుతున్న దృశ్యం

ఇదేమి చోద్యం..?

- కొండాపురంలో నీళ్ల కోసం తిరుమల ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్
- రైలు ఇక్కడినుంచే బయలుదేరుతున్నా టికెట్లు ఇవ్వని వైనం

కొండాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నుంచి ఓ వెలుగు వెలిగిన కొండాపురం రైల్వేస్టేషన్ ప్రస్తుతం వెలవెలబోతోంది. గతంలో ఈ స్టేషన్ మీదుగా వెళ్లే దాదాపు 80 శాతం రైళ్లకు ఇక్కడ స్టాపింగ్ ఉండేది. కరోనా మొదలైనప్పటి నుంచి రెండు రైళ్లు మినహా అన్నిటికి స్టాపింగ్ ఎత్తివేశారు. ప్రస్తుతం ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, తిరుపతి-హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రమే స్టాపింగ్ ఉంది. తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు కొండాపురం వరకు వచ్చి హాల్టింగ్ ఉన్నా స్టాపింగ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. దీంతో కొండాపురంతో పాటు చుట్టుపక్కల ఉన్న సింహాద్రిపురం, యల్లనూరు, తొండూరు మండలాల ప్రజలకు ఈ రైలు ఇక్కడ ఆగుతున్నా ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదు.

నీళ్లకోసం తిరుమల ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో కొండాపురం రైల్వేస్టేషన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. కర్నూలు జిల్లా మంత్రాలయం తర్వాత కొండాపురం రైల్వేస్టేషన్‌లోనే రైళ్లకు నీళ్లు నింపేవారు. మంత్రాలయం దగ్గరలో తుంగభద్ర నది నుంచి రైళ్లకు నీళ్లు నింపుతుండగా, కొండాపురం పక్కనే ఉన్న చిత్రావతి నది నుంచి రైళ్లకు నీళ్లు నింపుతారు. ఇందుకోసం చిత్రావతి నది నుంచి కొండాపురం రెల్వేస్టేషన్‌కు పైపులైను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు మాత్రమే కొండాపురంలో నీళ్లు నింపుతున్నారు. ప్రతిరోజు విశాఖపట్నం-కడప మధ్య నడిచే ఈ రైలు కొండాపురం రైల్వేస్టేషన్‌కు కేవలం నీళ్లు నింపుకోవడానికే కడప నుంచి వస్తుంది. కొండాపురంలో సుమారు నాలుగు గంటలు ఉంటుంది. ఈ సమయంలో రైలును క్లీనింగ్ చేయడంతో పాటు నీళ్లు నింపుతారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1-30 గంటలకు కొండాపురం నుంచి విశాఖపట్నం బయలుదేరుతుంది.

కొండాపురం నుంచే ఈ రైలు మొదలవుతున్నా స్టేషన్‌లో ఈ రైలుకు టికెట్లు ఇవ్వకపోవడం గమనార్హం.

కొండాపురం నుంచే బయలుదేరుతున్నా..

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు కొండాపురం రైల్వేస్టేషన్ నుంచే బయలుదేరుతున్నా స్టాపింగ్ లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. టికెట్లు ఇవ్వరు.. ఎక్కించుకొని టికెట్లు ఇస్తే రైల్వేశాఖకు లాభమే కాని నష్టమేమి లేదని వారంటున్నారు. స్థానికులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకురాగా, కొండాపురం నుంచే రైలు బయలుదేరేటప్పుడు ఎందుకు ప్రయాణికులను ఎక్కించుకోరని రైల్వే అధికారులను ఫోన్లో ప్రశ్నించారు. టికెట్లు ఇచ్చి ప్రయాణికులను ఎక్కించుకోవాలని ఎమ్మెల్యే కోరినా ఇంతవరకు స్పందన శూన్యం. కొండాపురం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులను ఎక్కించుకోకపోవడంపై వారు మండిపడుతున్నారు.



కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు

23న మాజీ సీఎం జగన్ రాక

వేంపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 23వ తేదీ ఆదివారం వేంపల్లెకు రానున్నారు. జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి కుమారుడు ప్రీతమ్‌రెడ్డి వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 10గంటల ప్రాంతంలో వేంపల్లెకు రానున్నారు. ఇందుకోసం కడప-పులివెందుల బైపాస్‌రోడ్డులో ఉన్న హెలిప్యాడ్ స్థలాన్ని సీఐ సురేశ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. వేంపల్లె పర్యటన అనంతరం హెలికాప్టర్‌లో జగన్ రైల్వేకోడూరుకు వెళ్లనున్నట్లు ఇప్పటి వరకు అధికారవర్గాల సమాచారం.

ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ

- గేట్‌లో 30 మందికి వెయ్యిలోపు ర్యాంకులు



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులతో కేక్ కట్‌చేయిస్తున్న అధ్యాపకులు

వేంపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గేట్ పరీక్ష లో ఆర్జీయూకేటీ పరిధిలో చదువుతున్న నాలుగు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 400 మంది విద్యార్థులకు ర్యాంకులు రాగా ఇందులో వెయ్యిలోపు ర్యాంకు 30 మందికి లభించిందని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఏఓ పెనుగొండ రవికుమార్ తెలిపారు. సెంట్రల్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్, ఉన్నత విద్య పోటీ పరీక్షల సమన్వయకర్త రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అమ్మిరెడ్డి అశోక్‌రెడ్డి 12వ ర్యాంకు, శివకృష్ణ 125, వర్ధన్ 174, చరణ్‌కుమార్ 182, భరత్ 201 ఇలా వెయ్యి వరకు పలువురు విద్యార్థులకు ర్యాంకులు లభించాయి. ఈ విద్యార్థులను వైస్‌చాన్సలర్ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సంద్ర, డైరెక్టర్లు అభినందించారు.

రీసర్వే వేగవంతం చేయండి: సబ్‌కలెక్టర్



బండమీదపల్లి సమీపంలో రీసర్వే పనులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పెద్దమండ్యం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అధికారులను ఆదేశించారు. పెద్దమండ్యం మండలంలో గురువారం ఆయన పర్యటించారు. వెలిగల్లు రెవెన్యూ గ్రామంలోని బండమీదపల్లి గ్రామ పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, రైతులు, రీసర్వే బృందాలతో మాట్లాడుతూ ఉమ్మడి సర్వే భూములపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూములు భాగపరిష్కారాలు, ప్రభుత్వ భూములు, పట్టా భూములు పలు అంశాలు పరిశీలించి పక్కాగా సర్వే చేయాలన్నారు. రైతుల ఉమ్మడి భూముల సమస్య వున్న ప్రాంతంలో రెండు బృందాలు కలసి రీసర్వే పనులు నిర్వహించాలన్నారు. అనంతరం పెద్దమండ్యం సమీపంలోని లేఅవుట్‌లో పక్కాగృహ నిర్మాణాలను పరిశీలించారు. జగనన్న లేఅవుట్‌లల్లో ఎన్ని పట్టాలు ఇచ్చారు.. ఎన్ని గృహాలు, నిర్మాణ వివరాలు అధికారులు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి, మండల ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, రీ సర్వే డీటీ మౌలా, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, హసింగ్ ఏఈ అక్రం, వీఆర్‌వోలు శ్రీనివాసులు, విశ్వంభరనాయుడు, నవాజ్ పాల్గొన్నారు.

పక్కా గృహాలను త్వరగా పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ సాంబశివయ్య



వెలిగల్లు గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

గాలివీడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 2019-24 మధ్య కాలంలో మంజూరై ఇళ్లు నిర్మించుకోలేక మధ్యలో ఆగిపోయిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెలిగల్లు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేక మధ్యలో ఆగిపోయిన వాటికి ప్రభుత్వం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు లబ్ధి చేకూరుతుందని, లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న పక్కా ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లతో మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బుక్కే రమేశ్‌నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్లు పూర్తి చేసుకోవాలి

● జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు అధికారి

రాయచోటిటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సాయంతో వేగవంతంగా ఇళ్లు పూర్తి చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణశాఖ పీవో సాంబశివయ్య లబ్ధిదారులకు సూచించారు. గురువారం ఆయన గాలివీడు మండలం ఉర్దూ స్కూల్ లేఅవుట్, ఎస్టీకాలనీ లేఅవుట్, రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంటల్లో సిబ్బందితో కలిసి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాల లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. ఇంటి యూనిట్ రూ.1.80 లక్షలకు అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అదనపు ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు. గాలివీడు మండలం ఉర్దూ స్కూల్ లేఅవుట్‌లో 8, ఎస్టీ కాలనీ లేఅవుట్‌లో 12, రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట అరుంధతి వాడలో 14 ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్లు ఇర్మాణాల్లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు.

భార్యాభర్తలకు గాయాలు



రక్తపు మడుగులో ఉన్న ఈశ్వరయ్య

సుండుపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండల కేంద్రానికి సమీపంలోని రాచంవాండ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో రాచంవాండ్లపల్లె వద్ద ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. సంబేపల్లె మండలానికి చెందిన జీ.ఈశ్వరయ్య, అతని భార్య, కూతురుతో కలిసి ద్విచక్రవాహనంలో మడితాడు గ్రామ పంచాయతీలోని అత్తవారింటికి వస్తుండగా సుండుపల్లె నుంచి రాయచోటికి వెళ్తున్న ఆటో ఏపీ39 టీపీ నెంబరు గల వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈశ్వరయ్యకు కుడికాలు విరిగినట్లు సమాచారం. అతని భార్యకు రక్తపు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

శవమై తేలిన అదృశ్యమైన యువకుడు



సంఘటనా స్థలంలో మృతుడి బంధువులతో మాట్లాడుతున్న సీఐ యుగంధర్, (ఇన్‌సెట్లో) సిద్ధరామయ్య (ఫైల్)

పీలేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన యువకుడు శవమై తేలిన సంఘటన గురువారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కథనం మేరకు.. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ కోళ్లపారానికి చెందిన బెల్లం వెంకటేశ్ కుమారుడు బెల్లం సిద్ధరామయ్య(36) ఈ నెల 15 నుంచి కనిపించడం లేదు. తెలిసిన వాళ్లు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా అతను కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు రెండు రోజుల క్రితం పోలీసులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం కోళ్లపారం సమీపంలోని గురుకులం పాఠశాల ప్రహరీ సమీపంలో ఓ శవం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతన్ని సిద్ధరామయ్యగా గుర్తించారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు కూడా అతన్ని గుర్తించారు. సంఘటనా స్థలంలో సిద్ధరామయ్య మృతదేహం పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అతని మృతదేహానికి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. సిద్ధరామయ్యకు భార్య భానుమతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చివరికి మిగిలేది అప్పులే..!

● కోత దశలో రాలుతోన్న పూత
● దిగుబడులూ అంతంతే..
● ఆదిలోనే అరకొర ధర
● ఆందోళనలో రైతన్నలు





ముందుగా విరివిగా పూసిన మామిడి పూత



అరకొరగా వచ్చిన మామిడి కాయలను పార్సిల్ చేస్తున్న కూలీలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి మామిడి తోటలు సాగు చేసుకున్నాం. ఆశించిన దిగుబడులు వస్తే ఈ ఏడాదైనా కష్టాలు తీరుతాయని ఆశపడ్డాం. ప్రకృతి సహకరించకపోవడంతో పూత రాలిపోతోంది. దిగుబడులు వచ్చే సమయంలో ధర కూడా అరకొరగానే ఉంటోంది. ఇలాగైతే చివరికి మిగిలేది అప్పులేనని నియోజకవర్గంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయచోటి నియోజకవర్గంలో వేరుశనగ సాగు జూదంలా మారిపోవడంతో రైతులు ఉద్యాన పంటల వైపు దృష్టి సారించారు. బోర్లు, బావుల కింద నియోజవర్గ వ్యాప్తంగా 3,600 హెక్టార్లలో మామిడి తోటలు సాగు చేశారు. ఇక్కడ పండే మామిడి పండ్లు రుచిగా ఉండడంతో విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేవి. ఈ నేపథ్యంలో పలువురు రైతులు నీరు లేకున్నా అష్టకష్టాలు పడి మామిడి మొక్కలు నాటి బతికించుకున్నారు. జనవరి నెల నుంచి మామిడిచెట్లను కన్నబిడ్డలాగా చూసుకున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఎరువులు, మందులు వాడారు. పూత విరివిగా రావడంతో ఈ ఏడాది తమ సమస్యలు తీరిపోతాయని రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. అయితే, వారి ఆశలన్నీ అడియాసలయ్యాయి. గాలివానలు రాకున్నా, పూత, పిందె రాలిపోతోందని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అరకొరగా కాసిన లాల్‌బాగ్ కాయలు టన్ను లక్ష రూపాయలు పైగా ధర పలుకుతుందని ఆశిస్తే, రూ.60 వేల నుంచి రూ.70 వేల వద్ద నిలచి పోతోందని అంటున్నారు. దీంతో చివరికి మిగిలేది అప్పులూ, కష్టాలు, కన్నీళ్లేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసందైన కాయల ధరే ఇలా ఉంటే, ఇక బేనీషా, బెంగుళూరు, నీలం వంటి రకాలకు ఏం ధర ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో పెనుగాలులు, వర్షాలు వస్తే పిందెలు కూడా రాలిపోతాయని రైతులు బంగ్రెడ్డి శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఆదినారాయణ, వీరాంజనేయులు తెలిపారు. కాగా, ఇన్సూరెన్స్ పేరుతో ప్రభుత్వం ఎకరాకు రూ.2500 కట్టించుకుందని, ఇన్సూరెన్స్ ఇచ్చి తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

30 ఎకరాల్లో సాగుచేశా..



నాకున్న 30 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేశాను. చెట్లు బతికించుకోవడానికి 20 బోర్లు వేశాను. 4 బోర్లల్లో మాత్రమే నీరువస్తోంది. కొన్ని చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని ట్యాంక్ రూ.700తో కొనుగోలు చేసి చెట్లను కాపాడుకుంటున్న సక్రమంగా పంట మంచి దిగుబడులు వస్తే 50 లక్షలు వస్తుంది. అలాంటిది ప్రతి ఏటా 10 లక్షలు రూపాయలు అప్పులే మిగులుతున్నాయి. ఉన్న పూత పిందె రాలిపోతోంది. ఈ ఏడాది నష్టాలే.

\- శంకర్‌రెడ్డి, రైతు, బి.ఎర్రగుడి

పూత రాలిపోతోంది



9 ఎకరాల్లో మామిడి తోట సాగుచేశాను. నీరులేక 100 చెట్లు ఎండిపోయాయి. అరకొర పిందెను బతికించుకోవడానికి ట్యాంకర్‌తో నీరం దించా.. 20 ఏళ్ల చెట్లను వదలుకోలేక చాలా కష్టపడుతున్నాం. ఒక్క సంవత్సరం కూడా సక్రమంగా దిగుబడి రాలేదు. ఐదేళ్లుగా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో చెట్లు ఎండిపోయే పరిస్థితి ఉంది.

\- లక్ష్మినారాయణ, కోనంపేట సర్పంచు

ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి 50 ఎకరాలు

● గతంలో కేటాయించిన భూమిని మార్చిన ప్రభుత్వం

కలికిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గడికోటలో పర్యాటకాభివృద్ధి కోసం ముంతాజ్ (ఒబెరాయ్ గ్రూపు) హోటల్ నిర్మాణం కోసం గతంలో కేటాయించిన భూమిని మార్చి ప్రత్యామ్నాయంగా మరో భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒబెరాయ్ గ్రూపు చేసిన విజ్ఞప్తి మేరకు దిగువపట్నం గ్రామంలోని సర్వే నంబరు 134లో 12.48 ఎకరాలు, స.నెం. 117లో 37.52 ఎకరాలను మొత్తం 50 ఎకరాలను వెంటనే ముంతాజ్ (ఒబెరాయ్ గ్రూపు) హోటల్‌కు స్వాధీనపరచాలని కడప కలెక్టరును ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఏపీ టూరిజం అథారిటీ సీఈవోను తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది. రాష్ట్రంలో అవకాశమున్న ఐదు ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు అనువుగా పి-3 పద్ధతిలో అవసరమైన భూమిని లీజు విధానంలో, ఇతర మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అభివృద్ధి పనులను ప్రభుత్వమే చేపట్టేందుకు అనువుగా ఈ ఐదు ప్రాంతాలకు గతంలో రూ.63.37 కోట్లు కేటాయించింది. ఇక హోటళ్లు, విలాసవంతమైన రిసార్టులు నిర్మించేందుకు ఒబెరాయ్ గ్రూపు ముందుకొచ్చింది. దీనికనువుగా ప్రముఖ పర్యాటక ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో ఒబెరాయ్ గ్రూపునకు అవసరమైన భూములను సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పేరూరు (తిరుపతి), అన్నవరం, భీమిలి (విశాఖపట్టణం), గడికోట (జమ్మలమడుగు), హార్సిలీహిల్స్ (మదనపల్లె), పిచ్చుకలంక (తూ.గోదావరి) ప్రాంతాలను ఎంపిక చేసి ఒబెరాయ్ హోటల్స్‌కు అవసరమైన భూములను అందజేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.. ఇక గడికోటకు పర్యాటకానికి అవసరమైన 50 ఎకరాలను గడికోట గ్రామంలో 2023లోనే ప్రభుత్వం కేటాయించింది. అయితే దీనికన్నా విస్తృతంగా కనుమ దృశ్యాలను, సరోవరాన్ని పర్యాటకులు వీక్షించేందుకు అనువుగా కొత్త భూమిని కేటాయించాలని ఒబెరాయ్ ప్రతిపాదించింది. దీనికనువుగానే మును పటి కేటాయింపులకు ప్రత్యామ్నాయంగా దిగువపట్నం గ్రామంలోని 50 ఎకరాలను అప్పగించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంతేగాకుండా ప్రస్తుతం మంజూరు చేసిన 12 మీటర్ల వెడల్పు రోడ్డుకు బదులుగా 45 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదనలకు కూడా ప్రభుత్వం సానుకూలత వ్యక్తపరిచింది. కొత్తగా కేటాయించిన ప్రత్యామ్నాయ భూమిని అక్కడున్న రిజర్వాయరు గరిష్ట వరద స్థాయిని పరిగణనలోకి తీసుకోవాలని, బఫర్ జోన్ నిబంధనల పరిధిలో అభివృద్ధి పనులు జరగాలనే షరతులతో కొత్తగా 50 ఎకరాల ప్రత్యామ్నాయ భూమిని కేటాయిస్తూ యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని యువకుడు మృతి

● ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన మౌలా

కురబలకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డ విషాదకర సంఘటన గురువారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముదివేడు పంచాయతీ సాహెబులవారిపల్లెకు చెందిన హుసేన్‌ఖాన్ కుమారుడు మౌలా(24) చికెన్‌దుకాణంలో పనిచేస్తున్నాడు. కాగా ఇతను తన సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో అంగళ్లు వైపునకు వస్తుండగా ముదివేడు సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కాగా ఈ ప్రమాదంలో మౌలా తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ యుకుడిని ప్రైవేట్ వాహన సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య చికిత్సలను అందిస్తుండగా మృతి చెందాడు. కాగా మృతుడికి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కాగా ప్రమాదం జరిగిన సంఘటనా స్థలానికి ముదివేడు పోలీసులు చేరుకుని విచారించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతోనే మృతి

● ఆసుపత్రి ఎదుట మృతుని బంధువుల బైఠాయింపు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బంధువులు

మదనపల్లెఅర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం ముదివేడు వద్ద గురువారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముదివేడుకు చెందిన చికెన్ సెంటర్ వ్యాపారి హుసేన్‌ఖాన్ కుమారుడు మౌలా (24) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స నిమిత్తం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే సరైన వైద్యం అందించకపోవడంతో మౌలా చనిపోయాడని మృతిని బంధువులు జిల్లా ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

ముదివేడు జాతరలో రికార్డింగ్ డ్యాన్స్‌ల హోరు...!

● అర్ధనగ్న ప్రదర్శన ● డీజే వాహనం సీజ్...
● ముగ్గురిపై కేసు నమోదు



జాతర సందర్భంగా నిర్వహిస్తున్న రికార్డింగ్ డ్యాన్స్

కురబలకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పడమటి ప్రాంత మండలాల్లో ప్రసిద్ధి చెందిన ముదివేడు జాతరలో రికార్డింగ్ డ్యాన్స్‌లు హోరెత్తించాయి. మండలంలోని ముదివేడులో వెలసిన దండుమారెమ్మ జాతరను ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. అయితే బుధవారం రాత్రి నిర్వహించిన జాతరలో పలువురు భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి చాందినీ బండ్లను కట్టారు. ఈ బండ్లతో పాటు మదనపల్లె, పుంగనూరు తదితర ప్రాంతాల మహిళలు, హిజ్రాలతో కొందరు నిర్వాహకులు అర్ధనగ్న ప్రదర్శనలను నిర్వహించారు. ముదివేడు పంచాయతీ గొల్లపల్లె, నడిమిపల్లె, గ్రామాల్లో మహిళలు, హిజ్రాలతో అర్ధనగ్న ప్రదర్శనలు భారీ ఎత్తున నిర్వహించడంతో పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు తరలివచ్చి తిలకించారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల దాకా నిర్వహించడం గమనార్హం. ఉదయం 6 గంటలకు ముదివేడు బస్టాండుకు చేరుకోగానే అక్కడ భారీ ఎత్తున డ్యాన్స్‌లు నిర్వహించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని లాఠీఛార్జ్ చేసి జనాలను తరిమికొట్టారు. కాగా డీజే వాహనాన్ని, ముగ్గురు నిర్వాహకులపై ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై మండల వ్యాప్తంగా తెలియడంతో పలువురు జోరుగా చర్చించుకుంటున్నారు.

పేలుడు పదార్థాలతో కూలీకి గాయాలు

కలకడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన గ్రామంలో నిర్వహిస్తున్న ఓ క్వారీలో పేలుడు పదార్థాలు పేలి రాము(45) అనే కూలీకి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం ఉండమల్లైకు చెందిన రాము కోన సమీపంలో ఉన్న క్వారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో క్వారీలో పేలుడు పదార్థాలను ఆరబెట్టి ఉంచారు. ఎండ వేడికి పేలుడు పదార్థాలు పేలాయి. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న రాముకు శరీరం కాలి బొబ్బలు వచ్చినట్లు తెలిపారు. గాయపడిన బాధితున్ని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

● డ్వామా పీడీ వెంకటరత్నం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

లక్కిరెడ్డిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ, జాతీయ ఉపాధి హామీపథకం పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీపథకం పనులపై 16 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై ఈ నెల 10 నుంచి 19 వరకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 1639 పనులకు గానూ రూ.15,800 కోట్లు నిధులు విడుదల చేశారు. మెటీరియల్‌కు రూ.4,800 కోట్లు మంజూరయ్యాయి. ఈ సామాజిక తనిఖీకి 6 మంది డీఆర్‌పీలను నియమించారు. ఈ తనిఖీల్లో ఎక్కువగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నట్లు బయటపడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బంది తమ ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగం చేశారని ఉపాధి సిబ్బందిపై పీడీ మండిపడ్డారు. జేఈ వెంకటపతి, కంప్యూటర్ ఆపరేటర్ పవన్‌నాయక్, టీఏ విజయదుర్గాప్రసాదు, రాఘవేంద్రలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఏపీవో డిల్లీబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మినరసయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణి, ఏపీడీఓ డిల్లీబాబు, టీఏలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి తీవ్రగాయాలు

● రెండుగా చీలిన కాలు ● పరిస్థితి ఆందోళనకరం



తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసులు

వాల్మీకలచెరువు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుడి కాలు రెండుగా చీలింది. దీంతో ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (50) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పొరుగు గ్రామంలోని బండమీదపల్లెలో నిర్మాణంలో ఉన్న భవనానికి మోల్డింగ్ వేయడానికి గురువారం వెళ్లాడు. అక్కడ కరెంటు రంపంతో కొయ్యలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలుకు తగిలి రెండుగా చీలిపోయింది. దీంతో స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు.

యువకుడు అనుమానాస్పద మృతి




అనుమానాస్పదంగా మృతిచెందిన యువకుడు

మదనపల్లెఅర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన తంబళ్లపల్లెలో చోటు చేసుకుంది. తంబళ్లపల్లె ఎస్ఐ లోకేశ్‌రెడ్డి వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం, గుండ్లపల్లె గ్రామం, చెట్లవారిపల్లెకు చెందిన నవీన్‌కుమార్ (24) తంబళ్లపల్లెలోని పుడమీ మార్టు అగ్రికల్చర్ ఆగ్రో ఏజన్సీలో రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఏజన్సీలో ఆడిట్ నిర్వహించి రూ.24 లక్షల సరుకు గోదాములో లేనట్లు గుర్తించారు. అక్కడే మేనేజరుగా పనిచేస్తున్న వ్యక్తి మరొకరు కలిసి నవీన్‌కుమార్‌పై నెపం మోపేందుకు యత్నించారు. గతంలో ఈ మేనేజరు మూడు ఎకరాల టమోటా సాగుకు సంబంధించి కావాల్సినవి సదరు గోదాము నుంచి తస్కరించి లెక్క చూపకుండా వాడేశారు. ఈ విషయం అంతా తెలిసిన నవీన్‌కుమార్ ఎక్కడ బయటపెడతారో అని గ్రహించి గురువారం యథావిధిగా పనికి వచ్చిన నవన్‌కుమార్‌కు అక్కడ ఉన్న పురుగుల మందు తాపించినట్లు మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. గోదాము వద్ద అపస్మారక స్థితిలో ఉన్న నవీన్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న తంబళ్లపల్లె పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. గోదామ్ మేనేజరు కృష్ణమూర్తి, ఇద్దరి వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. యువకుడిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అడవులతో ఆహ్లాదం... ఆనందం





- జీవరాశులకు మనుగడ
- పచ్చదనం పెంపునకు అటవీశాఖ చర్యలు
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

ప్రతి సంవత్సరం మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహిస్తారు. మొట్టమొదటి సారిగా 1971లో ఆహార వ్యవసాయ సంస్థ మార్చి 21న ప్రపంచ అటవీదినోత్సవం నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా అడవుల రక్షణ కోసం అంతర్జాతీయంగా సహకారం సమన్వయం పెంచుకుంటూ ప్రజలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నారు. అంతేకాకుడా అడవుల ప్రాముఖ్యత, ఉపయోగం గురించి ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు అటవీ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పచ్చని అడవులు పర్యావరణానికి, జీవరాశుల మనుగడకు ఎంతో ముఖ్యపాత్రను పోషిస్తు న్నాయి. కానీ వివిధ అవసరాల కోసం మాన వులు ప్రస్తుత రోజుల్లో చెట్లను తెగనరికి అడవుల విధ్వంసానికి పాల్పడుతున్నారు. ప్రజా అవసరాల, పర్యావరణ సమతుల్యం కోసం అడువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

పచ్చదనం పెంపు

అడవుల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చనే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పచ్చదనం పెంపునకు అట వీశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో నిధుల ద్వారా ఐదు లక్షల మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. ఇందులో 67వేల మొక్కలు అట వీశాఖ అడవుల్లో నాటడం జరుగుతుంది. మిగి లిన మొక్కలన్నీ ప్రజలకు పంపిణీ చేసి ఇంటింటా చెట్టు ఊరూరా వనం అనే విధంగా మొక్కల పెంపకాన్ని చేపట్టను న్నారు. వన్యప్రాణులను సంరక్షించేందుకు ఫేస్ ఫోర్ కెమెరా ట్రాకింగ్ ఎక్సైజ్‌లో భాగంగా టైగర్ జోన్ పరిధిలో 180 లోకేషన్‌లలో అధునాతన కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ముద్దనూరు, వేంపల్లె మినహాయించి ఇతర అన్ని ప్రాంతా ల్లో ఈ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు అటవీ శాఖ ఉన్నత అధికార యంత్రాంగం పేర్కొంటుంది.


కడప నగరవనం ముఖద్వారం



అడవులను సంరక్షించుకోవాలి

అడవుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణకు జరుగుతున్న ప్రయత్నాలు మన పర్యావరణ వ్యవస్థలో అవి పోషిస్తున్న కీలక పాత్ర గురించి ప్రతి ఒక్కరు అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉంది. మీడియా ద్వారా ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నాం. జిల్లాలో ప్రస్తుతం అనేక రకాల అటవీ సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాం. మన అడువులను సంరక్షంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

-వినీత్‌కుమార్, జిల్లా అటవీ అధికారి

నగరవనాల ఏర్పాటుతో...

మనసుకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నగరవనాలు మానవాళికి ఆనందం ఆహ్లాదాన్ని అంది స్తున్నాయి. జిల్లాలో కడప, బద్వేల్, గండికోట, ప్రొద్దుటూరు, పులివెందులలో నగరనాలు ఏర్పా టు చేశారు. కడప నగరంలో ప్రస్తుతం ఉన్న నగరవనానికి పక్కనే మరికొంత స్థలంలో నగర వనాన్ని విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.2కోట్లు ఖర్చు చేయనుండగా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1.40 కోట్లు మంజూరయ్యాయి. వీటితో మరికొన్ని మొక్కల పెంపకం, మౌలిక వసతుల కల్పన, తదితర అభివృద్ధి పనులు చేపట్టను న్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో ప్రస్తుతం ఉన్న ఎకో పార్కునే మరింత అభివృద్ధిపరచి ప్రజలకు నగరవనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం. వీటితో పాటు కమలాపురం నగర పంచాయతీలోని చెప్పలి రోడ్డులో, మైదుకూరు నియోజకవర్గంలోని ముదిరెడ్డిపల్లె వద్ద కూడా నగరవనాలను ఏర్పాటు చేసేందుకు అటవీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వన విహారిలో భాగంగా సోమశిల వెనకజలాల్లో అనువైన చోట చిల్డ్రన్స్ పార్కు, యాత్రికులు రాత్రివేళల్లో బస చేసేందుకు వీలుగా ఏర్పాటు చేయను న్నారు. అదేవిధంగా బోటింగ్ నిర్వహించేందుకు కూడా టూరిజం శాఖతో అటవీ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వారి ఆధ్వర్యంలో ఆర్మీ డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ సారథ్యంలో అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వివిధ కేటగిరీలైన అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీసర్ అసిస్టెంట్, స్టోర్ కీపర్, ట్రెడ్‌మెన్, తదితర ఉద్యోగాల నియామకాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం ప్రప్రథమంగా ఆన్‌లైన్‌లో కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను తెలుగులో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్‌సీసీ-ఎ బీ అండ్ సీ సర్టిఫికెట్ గల అభ్యర్థులకు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అగ్నివీర్ టెక్నికల్ కేటగిరి అభ్యర్థులకు, ఐటీఐ డిప్లొమా వారికి అదనపు మార్కులు ఉంటాయన్నారు. అర్హత గల అభ్యర్థులు వచ్చే ఏప్రిల్ 10వ తేదీ లోపు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

రేపు ఉద్యోగమేళా

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ (స్కిల్‌హబ్)లో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఇందులో పేటీఎం, డీసో బీపీఓ అండ్ ఐటీ సొల్యూషన్ ప్రయివేట్ లిమిటెడ్, ఎయిల్ డిక్సిన్ (కిరణ్ సర్వీసెస్) కేఎల్ గ్రూప్ తదితర కంపెనీలలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలీ కాలింగ్ ఆఫీసర్, అసెంబ్లింగ్ ఆపరేటర్స్ అండ్ క్వాలిటీ, వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగాల కోసం 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఏదీ డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి వుండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు 12 వేల నుంచి 25 వేల వరకు హోదాను బట్టి ఇస్తారన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫొటోస్ తీసుకుని రావాలన్నారు.

మెడిసిన్ సామగ్రి భద్రపరచేందుకు గోడౌన్ ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ద్వారా వచ్చే మందుల సామగ్రి భద్రపరచుటకు వీలుగా డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయ ఆవరణలో ప్రత్యేక గోడౌన్ ఏర్పాటు చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా కార్యదర్శి చాగలమర్రి ఓబులయ్య ప్రభుత్వాన్ని కోరారు. బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టరు అదితిసింగ్‌ను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన మందుల సామగ్రి నిల్వచేయడానికి సరైన గోడౌన్ సౌకర్యం లేకపోవడంతో ఆ కార్యాలయంలోనే నిల్వ చేస్తున్నారన్నారు. ప్రభు త్వం స్పందించి గోడౌన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

తెలుగుగంగ ఈఈగా క్రిష్ణారెడ్డి

పోరుమామిళ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల తెలుగుగంగ ఈఈ గా క్రిష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తెలుగు గంగ ఈఈగా, ఇన్‌చార్జ్ డీఈగా తెలుగుగంగ ప్రాజెక్టులో విధులు నిర్వహించారు. గురువారం ఆయన రెగ్యులర్ ఈఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను సన్మానించారు.


బాధ్యతలు స్వీకరించిన క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కుమ్మరాంపల్లెలో పట్టపగలే చోరీ

- రూ.6లక్షల విలువైన బంగారు, వెండి అపహరణ

వేంపల్లె, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామ సమీ పంలో గండి-వేంపల్లె ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. 6.50 తులం బంగారు ఆభరణాలు, కిలోన్నర వెండిచోరీ చేసినట్లు బాధితుడు మధుసూధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశా రు. వివరాలిలా.. కుమ్మరాం పల్లె సమీపంలో మధుసూ దన్‌రెడ్డి నివాసం ఉంటున్నా డు. గురువారం ఉదయం పని నిమి త్తం ఇంటికి తాళాలు వేసి భార్య భర్తలు వేంపల్లెకు వెళ్లారు. సాయంత్రం 7.30 గంటలకు ఇంటికెళ్లి చూడగా ఇంటి తలుపు చిలుకు బద్దలు కొట్టి ఉండడం గమనించి.. లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 6.50 తులం బంగారు ఆభర ణాలు, కిలోన్నర వెండి చోరీ చేశారని.. వీటి విలువ సుమారు రూ.6ల క్షలకు పైగా ఉంటుందని బాధి తుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సురేష్‌రెడ్డి, ఎస్‌ఐ రంగారావు ఘటన స్థలాన్ని పరిశీలించి.. క్లూస్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

దువ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ బాలికపై మాబూ షరీఫ్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటనపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బాలికకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మాబూ షరీఫ్‌పై పోక్సో కేసు నమోదు చేశామని చెప్పారు.

పశువైద్య విద్యార్థుల సమ్మె విరమణ

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో 45 రోజులుగా పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో సుఖాంతమైంది. ప్రస్తుతం అందిస్తున్న ఉపకార వేతనాలకు 50 శాతం మేరకు పెంచుతూ ప్రభుత్వం నుంచి జీవో విడుదలైంది. ఈ సందర్భంగా కళాశాలలోని అండర్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ విద్యార్థులు కాలేజీ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్‌కు సమ్మె విరమిస్తున్నట్లు లేఖను సమర్పించారు. తరగతులకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు శివతరుణ్, రాహుల్, రోహిత్, రమేష్, హృదయ, తదితరులు మాట్లాడుతూ ఈ జీవోతో తాము సంతోషంగా లేమని, అయితే ప్రభుత్వ బడ్జెట్, పరిమితులను పరిగణలోకి తీసుకుని సమ్మెను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. తమ సమ్మెకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞత తెలిపారు.


సమ్మె విరమణ లేఖను కళాశాల డీన్ శ్రీనివాసప్రసాద్‌కు అందిస్తున్న విద్యార్థులు

జూన్ నాటికి గండి ఆలయాన్ని ప్రారంభించాలి

- దేవదాయ ధర్మాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్

చక్రాయపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గండి వీరాజనేయ స్వామి దేవస్థాన పనులు పూర్తిచేసి జూన్ నాటికి ప్రారంభించాలని దేవదాయ ధర్మాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, కర్నూలు డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌లు పేర్కొన్నారు. గురువారం గండి అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, ముఖ్యఅర్చకులు గోపాలస్వామి, వేదపారాయణ పండితుడు రామ్మోహన్‌శర్మలు వారికి పూర్ణఫలంతో స్వాగతం పలికి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం గండిలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి ఎట్టిపరిస్థితుల్లో జూన్‌కు గండి అంజన్న స్వామిని భక్తులు దర్శించుకోవాలన్నారు. కొత్తగా నిర్మించే దేవాలయంలో క్యూలైన్లు, అద్దాలమండపం, ప్రహరీ, పడమర రాజగోపురం పనులను పరిశీలించి.. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే దేవస్థానంలో ఆకుపూజలు, టెంకాయలు, క్యూలైన్ల ఏర్పాట్లు తదితర వాటిపై చర్చించారు. ఏది ఏమైనా ఆగమశాస్త్ర ప్రకారం దేవాలయాన్ని పరిశీలించాలని కోరారు. అనంతరం వసతి గృహాలు, ప్రసాదాలపై ఆరాతీశారు. రికార్డులను తనిఖీ చేశారు. భావితరాలకు బాసటగా గండి ఆంజనేయ స్వామి భక్తులకు నిలవాలన్నారు. ఎంతో పురాతన ఆలయమని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఒక ప్లాన్ ప్రకారం ఆలయంలో పనులు చేపట్టాలని కోరారు. దేవస్థాన మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ విశ్వనాథరెడ్డి, ఈఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆలయాన్ని పరిశీలిస్తున్న ఆర్జేసీ, డీసీ

బంగారం పేరుతో బురిడీ.. వ్యక్తి అరెస్టు

- రూ.4.50 లక్షలు స్వాధీనం

ప్రొద్దుటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని దొరసానిపల్లె రోడ్డులో కీర్తి జనరల్‌స్టోర్ నిర్వాహకులను బంగారం పేరిట నకిలీ బంగారం ఇచ్చి 5.20 లక్షల సొమ్ము కాజేసిన వ్యక్తిని ఒన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం స్థానిక ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్లో సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌ఐ సంజీవరెడ్డితో కలిసి డీఎస్పీ భావన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరిలో కీర్తి జనరల్ స్టోర్‌కు చెందిన యజమాని చిట్టిబోయిన కీర్తి దుకాణంలో ఉండగా ఇద్దరు వ్యక్తులు తాము భార్యభర్తలమని.. ఇదే ఏరియాలో నివాసం ఉంటున్నామని తెలిపారు. జనరల్ స్టోర్‌లో సరుకులు కొనేవారమని తాము బెంగుళూరులో బిల్డింగ్ పనుల కోసం గుంతలు తీస్తుండగా బంగారు బిస్కెట్లు దొరికాయని చెప్పారు. ఫిబ్రవరి 21 కీర్తి జనరల్ స్టోర్‌కు వెళ్లిన మహిళ తమ వద్ద బంగారు బిస్కట్‌వుందని.. తక్కువ ధరకే ఇస్తామని చెప్పగా కీర్తి తన భర్తను అడిగి చెప్తానన్నారు. మరుసటి రోజు మరోసారి ఆ మహిళ భర్త వెళ్లి బంగారు రూ 25 లక్షలు అవుతుందని మీకు కేవలం రూ.5లక్షలకే ఇస్తామంటూ బంగారు పరీక్షించుకోవచ్చని ఒక బంగారు ముక్క ఇచ్చారన్నారు. దాన్ని బంగారు దుకాణంలో పరీక్షించగా అది నాణ్యతకలదని తెలియడంతో కీర్తి రామకృష్ణ దంపతులు బంగారు బిస్కెట్ కొనేందుకు ఆసక్తి చూపి ఫిబ్రవరి 23న వారి నుంచి బంగారు బిస్కెట్ రూ.5.20 లక్షలు ఇచ్చి తీసుకున్నారన్నారు. ఆ తరువాత బిస్కెట్ నాణ్యతను బంగారు దుకాణంకు వెళ్లి పరీక్షించగా అది నకిలీదని తేలిపోయిందన్నారు. దీంతో దాన్ని విక్రయించిన వారికి ఫోన్‌చేయగా వారి ఫోన్‌స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయామని గుర్తించి ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. వారి ఫిర్యాదు మేరకు నకిలీ బంగారంతో బురిడీ కొట్టించిన వారికోసం గాలింపు మొదలెట్టామన్నారు. గురువారం మధ్యాహ్నం మెయిన్ బజార్‌లోని కళామందిర్ వద్ద నిందితుడు బండారు నాగేశ్వరరావును అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి రూ.4,50,000లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని.. త్వరలో పట్టుకుంటామన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ భావన, సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌ఐ సంజీవ రెడ్డి

దిగుబడి రాక.. ధరలు లేక !

- ఆందోళనలో పత్తి రైతులు

రాజుపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలకు కష్టనష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది పత్తిపంట సాగు చేసిన రైత న్నలు దిగుబడి రాక.. ధరలు లేక దిగాలు చెందుతున్నారు. ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి మాత్రం వస్తోంది. దీనికితోడు పత్తి కొనుగోలుకు వ్యాపారస్తులు ముందుకు రాకపోవడం, జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు లేకపోవడం కూడా ధరలు లేకపోవడానికి కారణమని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం క్వింటా రూ.4500 నుంచి 5500 ధర పలుకుతోంది. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కోరుతున్నారు. కాగా, మండ లంలో గతంలో 12వేల నుంచి 15వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేసేవారు. రానురాను పత్తి పంటకు తెగుళ్లు ఆశించడం, ధరలు లేకపోవడంతో కొంత మంది రైతులు పత్తి సాగు చేయడం మానుకున్నారు. ప్రత్యామ్నాయ పంటలైన మినుము, జొన్న తదితర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో గుంటూరు, ఆదోని, తదితర మార్కెట్ల ద్వారా మిల్లులకు సంవత్సరానికి రాజుపాలెం మండలం నుంచి 200 నుంచి 400 లారీలు పత్తి ఎగుమతి చేసేవారు. నేడు 50 లారీలు పత్తి కూడా పంపే పరిస్థితి లేదు.


పత్తి పంట


లారీకి లోడు చేసిన పత్తి

జాతీయస్థాయి చెస్ పోటీల్లో లాస్యశ్రీ ప్రతిభ


లాస్యశ్రీని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

కడప స్పోర్ట్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మహారాష్ట్ర నారదవాడ జిల్లాలో జరిగిన స్కూలు గేమ్స్ చెస్ అండర్ 17 కేటగిరి జాతీయస్థాయి పోటీల్లో నగర గాంధీ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూలు విద్యార్థిని లాస్యశ్రీ బ్రాంచ్ మెడల్ సాధించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఆషిఫున్ గురువారం లాస్యశ్రీని అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. తద్వారా ఇటు తల్లిదండ్రులకు అటు పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కాగా రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జాతీయ స్థాయిలో సైతం లాస్యశ్రీ రాణించి బ్రాంచ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

వంద శాతం నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

చెన్నూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీలర్లంతా వారి పరిధిలో ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వంద శాతం నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దారు సరస్వతి అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డీలర్లు వ్యక్తిగత పనుల మీద బయటి ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఎండీయూ ఆపరేటర్లకు నిత్యావసర సరుకులు అందించి పంపిణీ జరిగేలా చూడాలన్నారు. అలాగే సకాలంలో డీడీలు చెల్లించడం, సక్రమంగా పంపిణీ చేయడంలో ఏమాత్రం ఆలస్యమైనా సహించేది లేదన్నారు.

జాతరలో పారిశుధ్య పనులు

చెన్నూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతర ఈనెల 23వ తేదీన జరగనున్న నేపథ్యంలో స్థానిక తూర్పువీధిలో గ్రామ పంచాయతీ పారిశుధ్య పనులు చేపట్టింది. అక్కడ ఉన్న మట్టి కుప్పలు చదును చేసి, చెత్త చెదారం తొలగించడం, పక్కనే ఉన్న మురగుకాల్వల్లో మురికి తొలగించడం జరిగింది. జాతర ప్రదేశంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు.

90శాతం సబ్సిడీతో ఆదరణ పనిముట్లు

చెన్నూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కులవృత్తులు చేస్తున్న వారికి 90 శాతం సబ్సిడీతో ఆదరణ పనిముట్లు అందించనున్నట్లు ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కులవృత్తులదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కులవృత్తులు చేసుకునే ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఆదరణ పథకం కింద అవసరమైన పనిముట్లను అందిస్తుందని తెలిపారు.

ఆస్తి పన్ను బకాయిలను చెల్లించండి

కమలాపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు ఆస్తి పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంబంధించిన ఆస్తి పన్నులను ఈనెల 31లోపు సచివాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో కానీ చెల్లించాలని, ఏప్రిల్ 1 నుంచి పెనాల్టీతో చెల్లించాలని ఆయన తెలిపారు.

నేడు కులవృత్తుల వారితో సమావేశం

వల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఈనెల 21న మధ్యాహ్నం 3గంటలకు కులవృత్తుల వారితో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘురాం తెలిపారు. మండలంలో మూడో విడత ఆదరణ పథకం కింద వారి కులవృత్తుల వారికి అవసరమైన ఆధునిక పనిముట్ల కోసం సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. వారు ఇచ్చిన సలహాలు, సూచనలు ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు.

ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

వల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9, 10, ఇంటర్ సెకండియర్ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 22 నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, అనాథ పిల్లలు, బడి బయట పిల్లలు, పేద, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు ఇఫ్తార్ విందు

కడప రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎర్రముక్కపల్లె సర్కిల్ బాలవికాస్ స్కూల్ సమీపంలోని దూదేకుల భవనంలో నూర్బాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు ఓబులేసు, అధ్యక్షుడు ఖాదరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరిశోధకులకు విస్తృత అవకాశాలు

● ఆచార్య ఎ.ఎస్.రాఘవేంద్ర



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): యువ పరిశోధకులు బలమైన కాంక్షతో పరిశోధన లక్ష్యంగా ముందుకు రావాలని, శాస్త్ర పరిశోధనలో విస్తృత అవకాశాలు ఉన్నాయని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఎఫ్ఎన్ఏ ఫెలో ఆఫ్ నేషనల్ అకాడమీ ఆచార్య ఎ.ఎస్.రాఘవేంద్ర స్పష్టం చేశారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (బెంగుళూరు), ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (న్యూఢిల్లీ), నేషనల్ అకాడమీ ఆఫ్ సైనెస్స్, ఇండియా (ప్రయాగ్‌రాజ్) ఆధ్వర్యంలో జీవ శాస్త్రంలో కమ్యూనికేషన్ వ్యవస్థలు అనే అంశంపై లెక్చర్, వర్క్‌షాప్‌ను గురువారం వైవీయూలోని తాళ్లపాక అన్నమాచార్య సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైంటిఫిక్ లెక్చర్స్‌పైన విద్యార్థులు స్కాలర్లు దృష్టిసారిస్తే సైన్స్ అకాడమీలు సహకారం అందిస్తాయన్నారు. పదిశాతం వరకు పరశోధనలవైపు యువత రావడం జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ వివిధ జాతుల మధ్య కమ్యూనికేషన్ పర్యావరణ సమతుల్యతను నిర్వహించడంలో సహాయపడుతుందన్నారు. కమ్యూనికేషన్ సహజీవన సంబంధాలను సులభతరం చేస్తుందని తెలిపారు. అనంతరం అతిథి కులసచివులు ఆచార్య పి.పద్మ, కోఆర్డినేటర్ డాక్టర్ వి.రామకృష్ణ ప్రసంగించారు. కన్వీనర్ రాజగోపాల్ ఎవల్యూషన్ ఆఫ్ క్లోరోప్లాస్ట్ అనే అంశంపై, ఆచార్య ఎస్.నరేష్ బాబు మైట్రోకాండ్రియా ఇన్‌హెల్త్ అడ్ డిసీజ్ అనే అంశంపై మాట్లాడారు. ఆచార్య డాక్టర్ దయానంద్ రేల్ ఆఫ్ ఎస్ఆర్ఎన్ఏఇన్ బ్యాక్టీరియల్ కమ్యూనికేషన్ అనే అంశంపై ఉపన్యసించారు.

అక్రమ అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఆర్జేడీకి వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి నాయకులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధన ఉల్లంఘించి 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని, అటువంటి విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, అఖిల భారత విద్యార్థి బ్లాక్ ప్రధాన కార్యదర్శి జయవర్దన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిల భారత విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ శ్యాములీకి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా గోబెల్ ప్రచారం చేసుకుంటూ, ఇంటింటికి వెళ్లి అక్రమ అడ్మిషన్లు చేస్తూ, అడ్మిషన్ ఫీజు, బుక్స్ కూడా పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ-టెక్నో, ఒలంపియాడ్, ఈ-స్మార్ట్, సీబీఎస్ఈ సిలబస్‌లు అనుమతులు లేకపోయిన లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని వాపోయారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పులివెందుల టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను మున్సిపల్ కమిషనరు దృష్టికి తీసుకువెళ్లిన కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని నగరిగుట్ట, బయమ్మతోట, చిన్నన్న రూములు, మంగళకాలనీలతో పాటు కొన్ని ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉందన్నారు. స్పందించిన కమిషనరు త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేలూరు శ్రీనివాస్‌రెడ్డి, కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి, బాలం సుబ్బరాయుడు, శివ పాల్గొన్నారు.

రూ.1.50కోట్లతో కొత్త బోర్లు

వేంపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీ పరిధిలో రూ.1.50కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 15 చోట్ల కొత్తబోర్లు వేయనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. ఈ మేరకు రాజీవ్‌నగర్ కాలనీలో గురువారం నూతన బోరు వేసేందుకు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, టీడీపీ యువనాయకుడు నామా వేమకుమార్ పాల్గొన్నారు.

కడప శిల్పారామం నూతన పరిపాలన అధికారిగా కృష్ణప్రసాద్

కడప కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగరశివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న శిల్పారామం నూతన పరిపాలన అధికారిగా కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. అనంతపురం నగర శిల్పారామం పరిపాలన అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్ బదిలీపై కడపకు వచ్చారు. ఆ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న శివప్రసాద్‌రెడ్డి బదిలీపై అనంతపురం నగర శిల్పారామం పరిపాలన అధికారిగా వెళ్లారు.

దైవం చూపిన బాటలో పయనించాలి

కడప కలెక్టరేట్ మార్చి 20(ఆంధ్రజ్యోతి): దైవం చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలనీ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం నగరంలోని ఎర్రముక్కపల్లిలోని నెక్సస్ గ్లోబల్ కార్యాలయంలో ఆ సంస్థ అధినేత సంపత్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు అఫ్జల్ ఖాన్ హాజరై ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందుల ద్వారా మత విబేధాలకు దూరంగా విందును ఏర్పాటు చేయడం అభినందనీమన్నారు. కార్యక్రమంలో ప్రముఖసంఘ సేవకులు సలావుద్దీన్, బాబుబాయ్, మగ్బూల్ బాషా, ఫహీం, సుబ్బరాయుడు, షఫీ, తయూబ్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



నిరసన తెలుపుతున్న విద్యుత్ మీటర్ రీడర్లు, తదితరులు

కడప సెవెన్ రోడ్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాగసుబ్బారెడ్డి డిమాండు చేశారు. ఈ మేరకు గురువారం కడప ఎస్ఈ కార్యాలయం వద్ద విద్యుత్ మీటర్ రీడర్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలుగా పనిచేస్తున్న మీటర్ రీడర్లు విద్యుత్ రంగంలో సంస్కరణల పేరిట ప్రధాని మోదీ కార్పొరేటర్లకు అప్పగించేందుకు విద్యుత్ సవరణ చట్టం తీసుకొచ్చి స్మార్ట్ మీటర్ల పుణ్యమా అని ఉపాధి కోల్పోయి రోడ్డునపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన సబ్ స్టేషన్లలో, ఖాళీలు ఉన్న సబ్‌స్టేషన్లలో మీటర్ రీడర్స్ ఐటిఐ అర్హత ఉన్న వారిని షిఫ్ట్ ఆపరేటర్‌గాను, అలాగే వాచ్‌అండ్ వార్డ్‌గా నియమించాలన్నారు. ధర్నా అనంతరం ఎస్ఈ రమణకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి బాదుల్లా, సుబ్బరాయుడు, కాంట్రాక్టు వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ బాబు, మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గఫార్‌బాష, ఆర్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అవగాహన అవసరం

కడప క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కడప ఫైర్‌స్టేషన్ అగ్నిమాపక అధికారి బస్విరెడ్డి అన్నారు. కడప నగరం ఫక్కీరుపల్లెలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటరులో గురువారం సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా విద్యుత్‌సర్క్యూట్, ఎల్‌పీజీ గ్యాస్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆ సంఘటన తెలుసుకుని మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. అనంతరం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎలా నిరోధించాలో సిబ్బందికి డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేశ్వర్‌రెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బుడగలను కేటగిరి 'ఏ'లో చేర్చడం హర్షణీయం

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంగా వెనుకబడిన తమ కులాన్ని ఏ కేటగిరిలో చేర్చేలా అసెంబ్లీలో ఆమోదించడం హర్షణీయమని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు కొనియాడారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక రియాజ్ థియేటరు సమీపంలో గల బుడగ జంగం కాలనీలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సమితి జిల్లా నాయకుడు పస్తం అంజి మాట్లాడుతూ తమ హక్కుల పోరాటాలకు స్పందించిన ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉర్దూ ఉన్నత విద్యా సంస్థలను పటిష్ట పరచండి

కడప ఎడ్యుకేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ ఉన్నత విద్యాసంస్థలను పటిష్టం చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (రూట, ఏపీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, ముష్తాఖ్ హుస్సేన్ డిమాండ్ చేశారు. గురువారం రూట కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉర్దూచదివిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ప్రభుత్వ యునాని కళాశాల ఏర్పాటుచేయాలని, ప్రతి నియోజకవర్గానికి ఒక యునాని పీహెచ్‌సీ కేంద్రం ఏర్పాటుచేయాలని, ఖాళీగా ఉన్న యునాని మెడికల్ ఆఫీసర్లపోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



ఇటీవల ఎమ్మెల్యేలకు నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ చూపి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి

సంగమేశ్వరుడి ఆదాయం రూ.5 లక్షలు

వీరపునాయునిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో పాపాఘ్ని, పావని, మొగమోరు నదుల అనుసంధానం వద్ద వెలసిన సంగమేశ్వర ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు లెక్కించగా రూ.5,00,300 ఆదాయం వచ్చినట్లు ఈవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.

అవినీతిని వెలికితీయాలి

వేంపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీలో అవినీతి జరిగిందని, పూర్తిస్థాయిలో విచారించి వాస్తవాలు వెలికితీయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. గురువారం వేంపల్లెకు వచ్చిన డీఎల్‌పీవో రమాదేవితో ఆయన మాట్లాడారు. గతంలో డీపీవోకు ఫిర్యాదు చేయగా కమిటీ ఏర్పాటు చేశారని, ఈవో, జూనియర్ అసిస్టెంట్ అవినీతిపై త్వరగా విచారణ చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సింహాద్రిపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం అందరి బాధ్యత అని ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, ఉపాధి హామీ పనుల తనిఖీలో భాగంగా గురువారం కోవరంగుట్టపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో మంచినీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చెత్త సేకరణను పరిశీలించారు. పారిశుధ్యం విషయంలో గ్రామస్థులు పూర్తిగా సహకరించాలని ఎంపీడీవో కోరారు.

23 నుంచి ఎన్.పాలగిరిలో గంగమ్మ జాతర

వీరపునాయునిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.పాలగిరి గ్రామంలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు గంగమ్మ జాతరను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకోనున్నారు. 23, 24వ తేదీల్లో పూజలు, 25న అమ్మవారిని పాలేటికి పంపడంతో జాతర ముగుస్తుందన్నారు.

ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకోవాలి

కమలాపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు నిర్వహించుకోనున్న జాతరలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ రోషన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 22, 23, 24వ తేదీల్లో ఎర్రగుడిపాడులో గంగమ్మ జాతర జరుగుతున్నందున గ్రామ మేటీలతో, కమిటీ మెంబర్లతో మీటింగ్ ఏర్పాటు చేసి గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా చూడాలన్నారు. ఏదైనా జరిగితే చట్టపరం గా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు.

కుట్టుమిషన్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పేదింటి మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం ఉచిత కుట్టుమిషన్ పంపిణీ, శిక్షణ అందించే పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 60 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 3 వేలు చొప్పున లక్ష వరకు కుట్టుమిషన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ పథకానికి మహిళలు మాత్రమే అర్హులని, స్థానికులై ఉండి ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం 20-40 సంవత్సరాల మధ్య వయస్సు వారై ఉండాలన్నారు.

ఆధునిక పనిముట్లు ఇవ్వండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పనిముట్లు ఇచ్చి ఆదుకోవాలని బీసీ సామాజిక వర్గానికి చెందిన కుల, చేతి వృత్తుల నాయకులు కోరారు. బీసీ కార్పొరేషన్ ఈడీ తన కార్యాలయంలో గురువారం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ జయసింహ మాట్లాడుతూ ఆదరణ-3 పథకం ద్వారా వివిధ కుల, చేతివృత్తుల వారికి ప్రభుత్వం పనిముట్లు అందిస్తుందన్నారు. దీనికి సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా సంఘ నాయకులతో వారికి కావాలల్సిన ఆధునిక పనిముట్ల ఆవశ్యకత, వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ



ప్రారంభిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలోని సిబ్బంది జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో నిర్వహించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుకోవాలని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం డీటీసీలో అత్యాధునిక ఈ-క్లాస్ రూంను ఎస్పీ ప్రారంభించారు. అధునాతన ప్రొజెక్టర్, ఇతర వసతులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంటూ వివిధ అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. శిక్షణలో భాగంగా భవిష్యత్తులో ఉపయుక్తంగా ఉండేలా రూపొందించిన మెటీరియల్‌ను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్ బాబు, అదనపు ఎస్పీ ఏఆర్ బి.రమణయ్య, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, పలు బ్రాంచ్‌ల సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

జోన్-4 పరిధిలో పలువురికి పదోన్నతులు

కడప కలెక్టరేట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అకౌంట్స్ డిపార్టుమెంట్‌లో గురువారం జోన్‌ల వారీగా పదోన్నతుల ప్రక్రియ జరిగింది. జోన్-4 పరిధిలో అనంతపురం, కడప, అన్నమయ్య, నంద్యాల, సత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో పని చేస్తున్న11 మంది సీనియర్ అసిస్టెంట్లకు సబ్ ట్రెజరీ అధికారులుగా తాత్కాలికంగా నియమిస్తూ ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటిలో పని చేస్తున్న లక్ష్మీనారాయణ అన్నమయ్య జిల్లాలోని సబ్ ట్రెజరీ అధికారిగా, సిద్దవటంలో పని చేస్తున్న యానాదయ్యను కడపకు, పుట్టపర్తిలో పని చేస్తున్న కేశప్పను అనంతపురానికి, నంద్యాలలో పని చేసే శ్రీనివాసరాజును శ్రీశైలానికి, పుట్టపర్తిలో పని చేసే రామాంజనేయులను రాయచోటికి, అనంతపురంలో పని చేస్తున్న జాన్ కృపాకర్‌ను మదనపల్లికి, అనంతపురంలో పని చేస్తున్న రామకృష్ణను చిత్తూరు జిల్లా పలమనేరుకు, కళ్యాణదుర్గంలో పనిచేస్తున్న షబానాను నందికొట్కూరుకు, హిందుపురంలో పనిచేస్తున్న ఆదిలక్ష్మిని రాయదుర్గానికి, ప్రొద్దుటూరులో పనిచేస్తున్న పి.ప్రమీలదేవిని అన్నమయ్య జిల్లా వాయల్పాడుకు, కడపలో పని చేస్తున్న బాబక్కను తంబళ్లపల్లికి సబ్ ట్రెజరీ అధికారులుగా నియమిస్తూ బదిలీలు చేశారు.

వైఎస్సార్ జిల్లా పేరులో మార్పు చేయడం తగదు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ జిల్లా పేరులో మార్పు చేయడం తగదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి తెలిపారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ఎన్నడూ చూడని పథకాలను ప్రజలకు అందించిన గొప్ప వ్యక్తి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అలాంటి వ్యక్తి పేరు ఉన్న జిల్లాకు మార్పులు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పులి సునీల్‌కుమార్, బీహెచ్ ఇలియాస్, శ్రీనివాసరెడ్డి, షఫీ, కిరణ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎంబార్కేషన్ తొలగించడం బాధాకరం

● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్లేవారి కోసం విజయవాడ ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్‌ను రద్దు చేయడం బాధాకరమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో కష్టపడి ఏపీలో ఎంబార్కేషన్ పాయింట్ సాధించామన్నారు. అదనపు భారాన్ని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇపుడు తీసేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసలాజం, మాజీ చైర్మన్ కరీముల్లా, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాఫుల్లా, కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళ పాడె మోసిన ఎస్ఐ



పేదమహిళ పాడె మోస్తున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని ఫైడిమాన్ కాలనీకి చెందిన పేద మహిళ మల్లీశ్వరి అంత్యక్రియలను అభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి స్వయంగా ఆ మహిళ పాడె మోశారు. వివరాలిలా ఉన్నాయి. మల్లీశ్వరి భర్త చెప్పలయ్య సిమెంటు పనిచేసుకుంటూ ఫైడిమాన్ కాలనీలో పూరిగుడిసెలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మల్లీశ్వరి అనారోగ్యంతో మృతి చెందింది. అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ లేకపోవడంతో ఎస్ఐ ద్వారా సమాచారం తెలుసుకున్న అభి ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ విజయ్‌బాబు బృందం అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారని వారిని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు ముదిరాజ్ రాము, జేసీబీ సుధాకర్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోండి

● మంత్రికి ఫిర్యాదు చేసిన పార్థసారథిరెడ్డి

వేముల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములు ఆక్రమించి వేసిన అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి గురువారం విజయవాడలో కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను కలిసి ఫిర్యాదు చేశారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం హయాంలో పులివెందుల ఔటర్ రింగురోడ్డు చుట్టుపక్కల వంకలు, వాగులు, పొరంబోకు స్థలాలు సర్వే నెంబరు 295/1, 295/3, 295/5, 295/8లను దొంగ ఎన్‌వోసీలు క్రియేట్ చేసి కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి ఆక్రమించి వెంచర్లు వేసి అమ్ముకోవడం జరిగిందన్నారు. అలాగే వెలమవారిపల్లె, ఎర్రగుడిపల్లె చుట్టుపక్కల 99, 101, 133, 139, 164, 215, 216 నెంబర్లలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అనుమతులు లేకుండా వెంచర్లు వేసి అమ్ముకున్నారని తెలిపారు. వీటిపై విచారణ చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు.

యురేనియంలో ఖలీల్ సొదాగర్‌పై ఫిర్యాదు

యురేనియం సంస్థల కీలక సబ్ కాంట్రాక్టర్‌గా ఉన్న ఎస్ఎంఎస్ కంపెనీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఖలీల్ సొదాగర్‌పై మంత్రి సవితకు ఫిర్యాదు చేశారు. యురేనియం పరిశ్రమలో ఆయన ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, టీడీపీ కార్యకర్తలను ఉద్యోగాలలోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఖలీల్ చేస్తున్న అక్రమాలు అన్యాయాలపై ప్రశ్నించిన మబ్బుచింతలపల్లె టీడీపీ నాయకుడు, ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీనాథరెడ్డిపై అక్రమంగా 307 సెక్షన్ కేసు నమోదు చేయించి ఇబ్బందులు గురి శారన్నారు. విచారించి టీడీపీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అవకాశం కల్పించాలని కోరారు.



మంత్రి సవితతో మాట్లాడుతున్న పేర్ల పార్థసారథిరెడ్డి

కుట్టుశిక్షణకు 180 మంది

ఎర్రగుంట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉచిత కుట్టు శిక్షణకు 180 మందిని ఎంపిక చేశారు. మరో 20మందిని ఎంపిక చేసిన తర్వాత శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తామని కమిషనర్ తెలిపారు.

తెలుగుగంగ కాలువకు నీరెప్పుడో..?

● నీరు రాక వెలవెలబోతున్న అట్లూరు మండలంలోని చెరువులు ● ఆందోళనలో రైతులు ● ప్రభుత్వం చొరవచూపాలంటున్న వైనం

అట్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ కాలువకు నీరురాదు.. ఆయకట్టు రైతులకు బెంగతీరదు అన్నట్లు అట్లూరు మండలం నిలి చింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల తలరాతలు మారవని రైతన్నలు వాపోతున్నారు. అట్లూ రు మండలంలో మూడేళ్లుగా తెలుగుగంగ కాల్వ పనులు ముందుకు సాగకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. బ్రహ్మం సాగర్‌లో పుష్కలంగానీరున్నా చెరువులకు నీరు చేరలేదు. అట్లూరు మండలానికి చేరువగా ఉన్న ఎర్రబల్లె చెరువు, లింగాలకుంట చెరువు, కుంభగిరి యాదవుల చెరువు, సిద్ధిరాజుచెరువు, కొండూరు మర్రిమానుకుంట, నల్లకుంట చెరువు, ఎర్రచెరువు, రెడ్డిపల్లెకు చెందిన రెడ్డిచెరువు, అట్లూరు వద్ద కొత్తచెరువులకు తెలుగుగంగ నీరు చేరలేదు. ఈ చెరువులన్నీ తెలుగుంగ కుడికాల్వ కు పక్కనే ఉన్నాయి. ఈ చెరువుల కింద దాదాపు 3వేల ఎకరాలు అసైన్ భూములు పట్టా భూ ములున్నాయి. ఎస్సీ ఎస్టీ బీసీ, ఓసీ బడుగు, బలహీన వర్గాలకు చెందిన రైతులు ఎక్కువ మంది ఉన్నారు. వర్షాధార పంటలు వేసి సాగు చేసే రైతులే ఎక్కువగా మంది ఉన్నారు. బద్వేలు మండలానికి చెందిన వెంకటశెట్టిపల్లె చెరువు, రాజుపాలెం చెరువులకు నీరు నింపారు కాని అట్లూరు మండలానికి మాత్రం మొండి చేయి చూపారు. 2002లో రూ11 కోట్లతో వైసీపీ ప్రభుత్వంలో గుత్తేదారుడు తెలుగుగంగ కాల్వ పనులు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు పనులు పూర్తి చేయక అసంపూర్తిగా ఉండడంతో బ్రహ్మం సాగర్‌లో నీరు ఉన్నా తెలుగుగంగ కాల్వకు సాగే పరిస్థితి లేదు.

గుత్తేదారుడిని రైతు లు ఎన్నో మార్లు ప్రశ్నించగా బిల్లులు సక్రమంగా రావడం లేదని చెప్పడంతో రైతులకు నిరాశ ఏర్ప డింది. ఖరీఫ్, రబీ సీజన్లు ముగుస్తున్నా చెరువులకు చుక్కనీరు చేరకపోవడంతో బోరుబావుల్లో కూడా నీరు అడుగంటుతుండడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు అధికారులు స్పందించి త్వరితంగా కాల్వ పనులు పూర్తి చేసి చెరువులకు నీరందించాలని అట్లూరు మండల రైతులు కోరుతున్నారు.



కాల్వపై బ్రిడ్జి కట్టేందుకు అడ్డంగా మట్టి పోసి తొలగించని గుత్తేదారుడు



నీరు లేక వెలవెలబోతున్న రెడ్డిచెరువు

చెరువులకు నీరందించి ఆదుకోవాలి



తెలుగుగంగ కాలువ పనులు సత్వరం పూర్తిచేసి చెరువులకు నీరందించాలి. బ్రహ్మంసాగర్‌లో నీరు ఉన్నా చెరువులకు నింపకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా చెరువులకు నీరు నింపకపోతే బోరు బావుల్లో కూడా నీటిమట్టం తగ్గిపోయి సాగు చేసిన చీనీ చెట్లు మామిడి ఎండిపోయే దశకు వచ్చాయి. ప్రభుత్వం రైతులను ఆదకోవాలి.

- బత్తల వెంకటసుబ్బయ్య,
మరిమానుకుంట చెరువు ఉపాధ్యక్షుడు

అనధికార స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

బద్వేలు, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): పుర పాలక సంఘం పరిధిలోని అనధికార స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని ఆర్డీవో చంద్రమోహన్ సూచించారు. పట్టణంలోని రిక్షాకాలనీ, సుందరయ్య కాలనీలలో గురువారం ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి పర్యటించి ప్రజలతో మాట్లాడారు. 2019 అక్టోబరు 15వ తేది నాటికి అనధికార ఆక్రమణ సలంలో నివాసగృహం నిర్మించి నివసిస్తున్న వారు కుటుంబంలోని మహిళ పేరుతో క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. లబ్ధిదారుల కుటుంబం ఏ సభ్యుడైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో గృహనిర్మాణ పథకంలో లబ్ధి పొందరాదని, స్వంత ఇళ్లు, ఇంటిస్థలం ఉండకూడదన్నారు. ఆవిధంగా లేనివారు ఈ పథకానికి అనర్హులవుతారన్నారు.



క్రమబద్ధీకరణపై ప్రజలకు వివరిస్తున్న ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్

బుడగజంగాలను ఎస్సీల్లో చేర్పించేలా కృషి చేస్తాం

● అసెంబ్లీలో సీఎం చంద్రబాబు తీర్మానంపై బుడగజంగాల సంబరాలు

ప్రొద్దుటూరు , మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోఉన్న బేడబుడగ జంగాలను ఎస్సీ కేటగిరి ఏ గ్రూపులో పెట్టడానికి కేంద్రాన్ని ఒప్పించి కృషి చేస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీర్మానం చేయడంపై బేడ బుడగజంగం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక 39 వవార్డు బేడబుడగ జంగం పేటలో సీఎం చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రినారాలోకేశ్ బ్యానర్లు పట్టుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సంబరాలు జరుపుకున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా తమ కు న్యాయం జగుతుందని సంఘం నాయకులు కొండయ్య, జమ్మయ్య, చంద్ర తదితరులు ఆశాభావం వ్యక్తం చేశారు.



హర్షం వ్యక్తం చేస్తున్న బుడగ జంగాలు

గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు పనులు

ఎర్రగుంట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు గ్రామంలో పనులు నిర్వహించాల్సి ఉంటుందని ఈవోఆర్డీ రంతుల్లయ్య పేర్కొన్నారు. మాలేపాడు గ్రామ సచివాలయంలో గురువారం ఆయన వార్డు సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఇరువర్గాల వారిని పిలిపించి మాట్లాడారు. పంచాయతీ తీర్మానమే శాసనమని, దాన్ని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీపీవో రాజ్యలక్ష్మి అనుమతి తీసుకుని త్వరలో గ్రామపంచాయతి సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, అప్పటి వరకు నీట సమస్య తలెత్తకుండా ఒక మనిషిని ఏర్పాటుచేసి వదులుతామన్నారు. కాగా గ్రామంలో తాగునీటి విషయంపై సర్పంచి, టీడీపీ వారి మధ్య ఏర్పడిన విభేదాలు తారాస్థాయికి చేరాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడి డీఎస్పీ దృష్టికి వెళ్లడంతో గ్రామంలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు.



ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఈవోఆర్డీ తదితరులు

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నిక

రాజుపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజుపాలెం రెవెన్యూ అధికారుల సంఘాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గుళ్లదుర్తి యల్లారెడ్డి కార్యదర్శిగా మేతకట్ల జయన్న, కోశాధికారి కేవీ క్రిష్ణమూర్తిలను అందరూ రెవెన్యూ అధికారులు కలిసి ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఐ హుసేన్‌రెడ్డి, మండల గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

ఎర్రగుంట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలం పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపిడీవో వెంకటరమణయ్య, ఈవోఆర్డీ రంతుల్లయ్య నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడుగా బ్రహ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఉపాధ్యక్షుడిగా చందన్, జనరల్‌సెక్రటరీగా భానుప్రశాంత్, గౌరవాధ్యక్షుడిగా శివశంకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలుగా మహేశ్వరి, కోశాధికారిగా నరేష్, గౌరవ సలహాదారుడుగా బి.కృష్ణలు ఎంపికయ్యారు.

రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలి

పోరుమామిళ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) :రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. గురువారం ఆయన స్వగృహంలో బద్వేలుకు చెందిన మాస్క్ కమిటీ అధ్యక్షుడు అల్లాబకాష్ ఆధ్వర్యంలో 500 మంది ముస్లిం నిరుపేదలకు రంజాన్ పండుగ సందర్భంగా నిత్యావసర వస్తువులు, బియ్యం ఎమ్మెల్సీ గోవిందరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహబూబ్‌భాషా, మౌళాలి, బద్వేలు మైనార్టీ అధ్యక్షుడు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పూలంగిసేవలో శ్రీనివాసుడు

బద్వేలు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపాలెంలో వెలసిన లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీనివాసుడికి పూలంగి సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ సత్యసంజీవకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆదరణ పథకానికి పేర్లు నమోదు చేసుకోండి

కాశినాయన మార్చి20(ఆంధ్రజ్యోతి): ఆదరణ పథకం కింద పనిముట్ల కోసం పేరు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో డాక్టర్ మైథిలీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీ బీసీలు నర్సాపురంలోని ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి పేర్లు నమోదుచేసుకోవాలని కోరారు. సాంప్రదాయ చేతివృత్తులవారు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణ 15వ వార్డు లోని బాలాజీ నగర్ 1, 2, మోడంపల్లి సమస్యలు పరిష్కారించాలని మున్సిపల్ ఆర్వోకు బీజేపీ అర్బన్ -2 అధ్యక్షుడు పాలెం కిరణ్, ఉపాధ్యక్షుడు కశెట్టి శ్రీనివాసులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువల పరిశుభ్రత, చెత్త తొలగింపు, తదితర సమస్యలను వెంటనే పరిష్కారించాలని కోరారు. రాష్ట్ర మహిళ కార్యదర్శి జయలక్ష్మి, అర్బన్ -1 వ అధ్యక్షుడు నరేంద్ర రావు, అర్బన్ -2 ప్రధాన కార్యదర్శులు గురురాజేష్, దేవరశెట్టి విక్రాంత్ పాల్గొన్నారు.

వాహనాలు రద్దుచేసి డీలర్లచే రేషన్ ఇవ్వాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు , మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ కోసం ఏర్పాటుచేసిన ఎండియూ వాహనాలను రద్దు చేసి డీలర్ల ద్వారానే రేషన్ పంపిణీ చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. డీలర్ల వద్ద అయితే లబ్ధిదారుడు ఒకరోజు కాకుంటే ఇంకో రోజైనా వెళ్లి రేషన్ తెచ్చుకుంటాడన్నారు. అదే వాహనాల్లో బియ్యం పంపిణీ అయితే వారు లబ్ధిదారుని నుంచి బియ్యం కొనుగోలు చేసి అదే వాహ నాల్లో రాజ మార్గంలో వెళ్లి విక్రయిస్తున్నారని ఆరోపించారు. గతంలో నెలకు రెండు సార్లు రేషన్ బియ్యం ప్రభుత్వం ఇవ్వడం ద్వారా అవి లబ్ధిదారుల కంటే బ్లాక్ మార్కెట్‌కే ఎక్కువగా తరలివెళ్లాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో బ్లాక్‌లాగ్ పెట్టిన డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండండి

దువ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. దువ్వూరులో గురువారం సైబర్ క్రైంపై ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ల ద్వారా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ నమ్మవద్దని చెప్పారు. వివిధ లింక్‌లు అడిగితే వాటిని తెలుపవద్దని చెప్పారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.

నేటి నుంచే పెద్దమ్మతల్లి దేవర

మైదుకూరు రూరల్ ,మార్చి20(ఆంధ్రజ్యోతి) : మైదుకూరులో నేటి నుంచే పెద్దమ్మతల్లి దేవర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురువారం నిర్వాహకులు తెలిపారు. స్థానిక పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లి దేవర కార్యక్రమంలో శుక్రవారం, శనివారం చల్ల కార్యక్రమం, ఆదివారం దేవర ఉంటుందని వారు తెలిపారు. ఈ పెద్దమ్మతల్లి దేవర కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు రానున్నారు.

ఈద్గాలో షామియానా, నీటి వసతి కల్పించాలి

● కమిషనర్‌కు ముక్తియార్ వినతి

ప్రొద్దుటూరు , మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రంజాన్ పండుగరోజు ముస్లిం భక్తులు నమాజ్ చేయడానికి ఈద్గా మైదానంలో నీడ కోసం షామీయానాలు తాగునీటి వసతి కల్పించాలని మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ ముక్తియార్ కోరారు. గురువారం కమిషనర్ మల్లికార్జునను మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జిలాన్, అంజుమన్ కార్యదర్శి ఇలియాస్‌కురేషి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకురాలు మృతి

కొండాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సుజాత(35) మృతి చెందినట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు.ప్రొద్దుటూరు సంజీవనగర్ కు చెందిన ఈమె తమ పాఠశాలలో ఫిజిక్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆమె ఇంటివద్ద ఉండగా గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారన్నారు. కాగా ఈమెకు భర్తతో పాటు ఇద్దరు కూతుళ్లు (చిన్నపిల్లలు) ఉన్నారు. అధ్యాపకురాలు మృతి చెందటం పట్ల ప్రిన్సిపాల్, సిబ్బంది సంతాపం తెలిపారు.

సీఎం చంద్రబాబుకు ఎమ్మార్పీఎస్ ధన్యవాదాలు

పోరుమామిళ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీవర్గీకరణపై అధ్యయనానికి నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదికను రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం పట్ల మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కమిటీ సభ్యుడు ఓబులాపురం శోభన్‌కుమార్ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఏపీలో 59 ఎస్సీ కులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం 15శాతం రిజర్వేషన్‌ను న్యాయబద్ధంగా కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లు సుదీర్ఘపోరాటం చేసిన పద్మశ్రీ మందక్రిష్ణమాదిగకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

పింఛను మంజూరు చేయాలని దివ్యాంగుడి వినతి

పోరుమామిళ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పింఛను మంజూరు చేయాలని దివ్యాంగుడు ముండ్లపాటి చిన్నప్ప ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. షుగరు కారణంగా ఏడాది క్రితం తన కాలు తొలగించారని అప్పటి నుంచి జీవనం కష్టతరంగా మారిందన్నారు. ప్రస్తుతం కాలు లేకపోవడంతో భార్య కూలీకి పోయి డబ్బులు తెస్తే తప్ప కుటుంబం గడవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పింఛను కోసం దరఖాస్తు చేసుకుని ఏడాది అవుతున్నా ఇంకా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు మాత్రం పింఛను జాబితా విడుదల చేస్తే మంజూరు చేస్తామని చెబుతున్నారని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని చిన్నప్ప ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

జమ్మలమడుగు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ షిరిడీసాయి డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని తహసీల్దారు శ్రీనివాసరెడ్డి రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రొద్దుటూరు సురక్ష బ్లడ్ బ్యాంక్ వారు నిర్వహించిన శిబిరంలో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎన్.హైమావతి, డైరెక్టర్ సంజీవరెడ్డి, ప్రిన్సిపాల్ సుజాత, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ద్వారకానాధ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థి

ఈ-కేవైసీ తప్పక చేయించుకోండి

కలసపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడు ఈ-కేవైసీ తప్పక చేయించుకోవాలని కలసపాడు తహసీల్దార్ మధురవాణి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి సభ్యుడు తమ ఆధార్ కార్డు, రేషన్‌కార్డును చౌకదుకాణం వద్దకు తీసుకెళ్లి ఈనెల 31లోపు ఈ-కేవైసీ నమోదు చేయించాలని ఆమె కోరారు.

పేదలకు మినరల్ వాటర్ సరఫరా

ప్రొద్దుటూరు , మార్చి 20 (ఆంధ్రజ్యోతి) :ప్రముఖ సినీ నటుడు మెగా స్టార్ చిరంజీవి తనయుడు రామచరణ్ జన్మదిన వారోత్సవాల సందర్భంగా మెగాఫ్యాన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గోకుల్ నగర్‌లో పేదలకు మినరల్ వాటర్ సరఫరా చేశారు. పట్టణంలోని శ్రీకృష్ణాలయం వద్ద వున్న గోశాలలో ఆవులకు ఆకుకూరలు, చిరుధాన్యాలు అందజేశారు. ఈ సందర్భంగా మెగా ఫ్యాన్స్ అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు అక్కిదాసరి రామారావు మాట్లాడుతూ చి మెగా స్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తితో తాము ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మెగా అభిమానులు మధు, చిరురాయల్, షరీఫ్, బాబురావు, మెడికల్‌శీను, సాగర్,శ్యామ్, చంద్రధర్, చోటు, రవి, కేశవ, రాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.



గోకుల్ నగర్‌లో మినరల్ వాటర్‌ను అందిస్తున్న దృశ్యం

పన్ను కడితేనే తాగునీరు సరఫరా చేస్తాం

జమ్మలమడుగు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో నీటిపన్నులు కడితేనే తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఆమేరకు గురువారం ఉదయాన్నే మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు వాటర్‌ట్యాక్స్ కట్టనివారికి అక్రమ కుళాయిదారులకు మున్సిపల్ సిబ్బంది పైపులు కట్ చేశారు. దీంతో పట్టణంలో మున్సిపల్ అధికారుల దూకుడుకు కళ్లెం వేయాలని, పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నుల పేరుతో పేదలను వేధించడం దారుణంగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దూకుడు మానుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్నారులకు చదువుపట్ల అవగాహన కలిగించాలి

చాపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు చదువుపట్ల అవగాహన కలిగించాలని ఐసీడీఎస్ చాపాడు ప్రాజెక్టు సీడీపీవో సావిత్రమ్మ అన్నారు. చాపాడులోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం నుంచి అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో దువ్వూరు, చాపాడు మండలాల అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేటలో: పిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా చూడాల్సిన బాధ్యత అంగన్వాడీ వర్కర్లపై ఉందని మైదుకూరు సీడీపీవో శ్రీదేవి అన్నారు. గురువారం ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణభవన్ కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లకు పోషన్ బీ పడాయి బీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో 45 మంది అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, ఎ.రమాదేవి, ఎస్.జహరాబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్‌లో: అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించాలని ఐసీడీఎస్ రూరల్ సీడీపీవో అరుణకుమారి పేర్కొన్నారు. స్థానిక నడింపల్లెలోని సీడీపీవో రూరల్ కార్యాలయ సమావేశంలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్‌పీఎస్‌డీ ప్రాజెక్టు సేవలు కార్యకర్తల సామర్థ్యాన్ని పెంచడంలో శిక్షణ అందించారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ రాధ్యా కళావతి, ఈశ్వరీలు అంగన్వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై శిక్షణ అందించారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు

గోపవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యమని గోపవరం, బద్వేలు ఎంపీడీవో రామనాధరెడ్డి అన్నారు. ఆదరణ 3 పథకం కింద పలు రకాలైన పనివృత్తుల వారికి పనిముట్లను ఏర్పాటు చేసే విషయమై స్థానిక గోపవరం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండయ్య సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను విరమించుకోవాలి'

కొండాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను విరమించుకోవాలని మాల మహానాడు నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం వారు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మీనాకు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో ఎక్కువగా ఉన్న మాలలను తక్కువగా చూపించి ప్రభుత్వం వర్గీకరణ చేయాలనుకోవడం దారుణమన్నారు. వర్గీకరణ అంశాన్ని పక్కన పెట్టి తమకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు నేతలు మనోహర్‌బాబు, జోసెఫ్, జయంతు, గిరిష్ విజయరాజు, చిన్న పాల్గొన్నారు.

సజావుగా చెత్తసేకరణకు చర్యలు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె పంచాయతీలో చెత్త సేకరణ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం విలేజ్ విజిట్ కార్యక్రమంలో భాగంగా ఆయన పెద్దశెట్టిపల్లెలో పర్యటించి ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. పెద్దశెట్టిపల్లెలో రోజు మార్చి రోజు చెత్త సేకరణ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈవోపీఆర్డీ రామాంజనేయులురెడ్డి, కార్యదర్శులు సుధాకర్, మస్తాన్ పాల్గొన్నారు.